
# మినీకథలు

## తొలివలపే.....

యడవల్లి సుధీర్

శంకర్ హుషారుగా ఈల వేసుకుంటూ తను అద్దెకుంటున్న గది గుమ్మం తలుపు తాళం తీయబోయి ఒక్కక్షణం ఆగాడు. "రోజూలా లేదు. ఏదో మార్పు కనిపిస్తోంది. ఏమిటబ్బా" అని ఆలోచిస్తూనే ప్రక్క పోర్షన్ వైపు చూశాడు. అక్కడ రోజూ మామూలుగా గోడకి వ్రేలాడుతూ కనిపించే "టులెట్" బోర్డు కనిపించలేదు. రోజూ గడియ వేసుండే ఆ గుమ్మానికి వాళ్ళ తాళం వ్రేలాడుతోంది. "అంటే ప్రక్క పోర్షన్ ఎవరికో అద్దెకివ్వబడిందన్న మాట." అనుకుంటూ తన రూమ్ తాళం



తీసి లోపలికి అడుగుపెట్టాడు. బియ్యం కడిగి పొయ్యిమీద పెట్టి నవలా పఠనంలో మునిగిపోయాడు.

శంకర్ స్వతహాగా ఊహాజీవి. చిన్నప్పటి నుంచీ ప్రతి చిన్న విషయాన్నీ ఎంతో అందంగా ఆలోచిస్తూ గడిపేవాడు. హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు ఫర్మ్‌లో ఉద్యోగం రావటంతో చిన్న రూమ్ తీసుకుని వుంటున్నాడు. నవల మంచి రసకందాయంలో వుండగా అతని ముక్కుపుటాలకి మాడు వాసన బలంగా తగలటంతో తెప్పరిల్లి అన్నం పొయ్యిమీది నించి కిందికి దింపాడు.

ఇంతలో పక్కపోర్షన్‌లోంచి మాటలు వినబడుతున్నాయి. "రేపొక్కరోజూ కూడా సెలవు పెట్టరా అన్నాయ్! లేకపోతే నేనొక్కదాన్నే ఈ సామాన్లన్నీ సర్దలేక చచ్చిపోతాను" అంటోంది ఆమె. ఆ కంఠంలోని మాధుర్యం శంకర్‌ని ఆకర్షించింది. ఆ కంఠానికి తగిన ఆమె రూపాన్ని ఊహించుకుంటూ ఆ రాత్రి గడిపాడు.

ఉదయం నిద్రలేచి తన పనులు తాను చూసుకుంటున్నాడు శంకర్. పంపు దగ్గర్నించి నీళ్ళు తెస్తూ అనుకోకుండా పక్క పోర్షన్ వైపు చూశాడు. ఒక అందమైన అమ్మాయి-నవలా నాయికలా ఉంది సుమారు పద్దెనిమిదేళ్ళుంటాయి. గుమ్మంలో కూర్చుని కూరలు తరుగుతోంది. "అందమైన ఆడపిల్ల ఏపని చేసినా ఆ అందం రెట్టింపవుతుంది" అని ఎక్కడో చదివినట్టు గుర్తొచ్చింది అతనికి.

కానీ వెంటనే ఆ తన్మయత్వంలోంచి తేరుకున్నాడు. ఆమె ఒక్కసారి తలెత్తితే చాలు నీళ్ళ బిందెతో దేభ్యం మొహంతో నిలబడి ఉన్న తను కనిపిస్తాడు. ఆ ఊహ రాగానీ అతడు చకాచకా తన గదివైపు నడిచాడు. అయినా శంకర్‌కి అనుక్షణం ఆమె అందమైన రూపమే గుర్తొస్తోంది. కళ్ళల్లో మెదులుతోంది. రోజులు గడుస్తున్నాయి. కానీ ఆమె అందమైన రూపం అతని మనసులోంచి చెరిగిపోవటంలేదు. పంచదార అయిపోకపోయినా ఒకటి రెండు చెంచాలు అప్పు తీసుకోవటం దగ్గర్నించీ ఆఫీసూ, రూమూ తప్ప మరెక్కడికీ వెళ్ళకపోవటం దాకా ఎన్నో కొత్త అలవాట్లు చేసుకున్నాడు శంకర్. మొట్టమొదట ఒకసారి కరెంట్ ఫ్యూజ్ పోతే వెయ్యడం ద్వారా తనని తాను వాళ్ళన్నయ్యకి పరిచయం చేసుకున్నాడు. ఆమె మిత భాషి. కానీ అతను మాట్లాడుతుంటే నవ్వుతూ ఆసక్తిగా వింటుంది. పరిచయాలు మరికొంచెం ముందుకు వెళ్ళాయి. ఆమె అన్నయ్య ద్వారా నవలలు చేతులు మారాయి. అవసరమున్నా లేకపోయినా వాళ్ళు మార్కెట్‌కి వెళ్ళినప్పుడే తనూ వెళ్ళేవాడు. ఒకరోజు రాత్రి వాళ్ళన్నయ్య ఆమెతో అంటున్న మాటలు వినిపిస్తున్నాయి

"సాధ్యమైనంత త్వరగా వచ్చేస్తాలే. దేనికీ మొహమాటపడకు. ఏదైనా కావాలంటే పక్కన రూమ్‌లో ఉంటున్న అతన్ని అడిగి తెప్పించుకో"

"అలాగేలే దానికి నువ్వింత చెప్పాలా" అంటోందామె నవ్వుతూ.

మర్నాడు ఉదయం ఆమె తలంటుకుని వీధి వరండాలో నిల్చొని తల వెంట్రుకలు ఆరబెట్టుకుంటోంది. పాల ప్యాకెట్ తీసుకుని వస్తూ ఆమెని చూశాడు. ఆమె అతన్ని చూసి అలవోకగా నవ్వింది. శంకర్ మనసులో ఏదో తీయని అనుభూతి కలిగింది తను చదివిన ఎన్నో నవలలలోని హీరో హీరోయిన్ల పాత్రలు గుర్తొచ్చాయి. ప్రేమ ప్రారంభదశలో వున్నప్పుడు రచయిత(త్రు)లు వర్ణించే సంఘటనలన్నీ అతని కళ్ళముందు మెదులుతున్నాయి. అవన్నీ అతని జీవితంలో జరిగినట్లే అనిపిస్తోందతనికి.

ఆమె నవ్వటంతో అతను కొంచెం చొరవ తీసుకుని "నా దగ్గర ఓ మంచి నవలుంది-ఇస్తాను. చదవండి. నేనూ రాత్రే చదివాను. చాలా బావుంది." అన్నాడు.

"ఇవ్వండి. నాకూ ఏం తోచటంలేదు. మా అన్నయ్య ఊరెళ్ళాడు- తెలుసుగా" అందామె నవ్వుతూ.

ఆ నవ్వులో, ఆ మాటల్లో అతనికి ఎన్నో అర్థాలు కనిపించాయి. వినిపించాయి ఆరోజు ఆఫీసుకి శెలవు పెట్టడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ విషయం ఆమెకి తెలియాలనే పది దాటాక వెళ్ళి ఆ నవల ఇచ్చేసి పది నిమిషాలు కూర్చుని మాట్లాడి వచ్చేశాడు. ఆ రోజు అతనికి ఎంతో ఆనందంగా ఉంది. మాటిమాటికీ ఆమె నవ్వే గుర్తొస్తోంది. ఆ మాటల్లోని అర్థాల్ని వెదకటానికి అతడు శత విధాల ప్రయత్నిస్తున్నాడు. అలాగే

ఆమె గురించి ఆలోచిస్తూ రెండు గంటలు గడిపాడు భోజనం చేసి మంచం మీద నడుం వాల్చాడో లేదో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. తలుపు తీశాడు. ఎదురుగా ఆమె అందాల అప్సరసలా నిలబడి ఉంది "ఒకసారి మా ఇంటికి వస్తారా. మీకో విషయం చెప్పాలి" అందామె. అలా అంటున్నప్పుడు ఆమెలో సిగ్గుని చూశాడతను "చుట్టూపక్కల ఇళ్ళ వాళ్ళందరూ పడుకున్నట్టున్నారు" అందామె కొంచెం గబగబా. "అలాగే. వస్తున్నాను పదండి" అన్నాడు ఆమెను అలా ఎక్కువసేపు నిలబెట్టడం ఇష్టంలేక. "మెల్లిగా శబ్దం చెయ్యకుండా రండి" అందామె వెళ్తూ. "అలాగే అలాగే" అన్నాడు శంకర్. తామిద్దరూ అలాంటి పరిస్థితిలో ఉండగా ఎవరయినా చూస్తే బావుండదు. ప్రేమ మొదటి అధ్యాయంలో ఉండగానే అందరికీ తెలిస్తే ఏం బావుంటుంది అనిపించిందతనికి. చొక్కా వేసుకుంటూ ఎన్నో విషయాలు ఆలోచించాడు. తను ఎంత అదృష్టవంతుడు! ఈ అమ్మాయికి అందంతో పాటు తెలివితేటలు కూడా ఉన్నాయి. అందుకే ఇన్నాళ్ళూ తన మీద ఎంత అనురాగమున్నా బయట పడకుండా ఎంతో జాగ్రత్తపడింది. అవకాశం కోసం ఎదురుచూసి వాళ్ళన్నయ్య ఊళ్ళో లేని సమయంలో ఎవరూ చూడకుండా తనని పిలిచి ఆ విషయం మాట్లాడాలనుకోవటం-నిజంగా ఆమె ఎంత బాగా ఆలోచించింది. ఇలా ఆలోచిస్తూనే శంకర్ వాళ్ళ పోర్షన్‌లోకి అడుగుపెట్టాడు. ఆమె అలాగే ఆతృతగా అతని రాక కోసం ఎదురుచూస్తూ నిలబడి ఉంది. ఆమె అతన్ని చూసింది. అతడు ఆమెని చూశాడు. ఆమె నుదుటి మీద స్వేద బిందువులు. పెదవులు వణుకుతున్నాయి.

ఆమె ఆ విషయం ఎలా చెప్పాలా అని తటపటాయిస్తోందని గ్రహించాడు శంకర్. ఎంతైనా ఆడదికదా. పైగా ఫస్ట్ ఎక్స్‌పీరియన్స్ తనకీ అది మొదటి అనుభవమే. అయినా తను మగవాడు.

"మీకో మాట చెప్పాలి. ఇక్కడ కాదు. ఇలా బెడ్ రూమ్‌లోకి రండి." అలా అంటున్నప్పుడు సిగ్గుగా ఆమె కళ్ళని పైకెత్తి అతని వైపు అదోలా చూడటం గమనించాడు. ఆమె ఆ మాట అని గది మూలకి మెల్లిగా నడిచి వెళ్ళింది. అతను బెడ్ రూమ్‌లోకి అడుగుపెట్టాడు.

వెనుక వచ్చిన ఆమె అతని చేతిలో కర్ర అందించి బెడ్ వైపు చూపిస్తూ "పా.... పాము" అంది. ఆమె నుదుటిమీద స్వేద బిందువులు ఆమె పెదవులు వణుకుతున్నాయి.

బెడ్ మీద నిశ్చలంగా నిద్రపోతోంది పాము.

---

పుస్తకం పరహస్తం గతంగతః అన్నారు పెద్దలు.

గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో ఆరే ఆరు ఫ్లాట్స్ వున్నాయి అందంగా.

ఆఫీసులో పొజిషన్ల మాట ఎలా వున్నా ఇంటి దగ్గర. ఇంటిని తీర్చిదిద్దడంలోనూ. అతిధుల్ని ఆహ్వానించడంలోనూ. కబుర్లు చెప్పడంలోనూ ఆధిక్యతను నిరూపించుకునేందుకు ప్రతి ఇల్లాలూ ప్రయత్నిస్తోందనడం పచ్చి నిజం.

ఇది ఇలా వుండగా నంబర్ వన్ ఫ్లాట్‌లో వున్న ఎల్లెస్ మణ్యం శ్రీమతి 'మిసెస్ మణ్యం' మాట్లాడుతూ మాట్లాడుతూ 'మిస్టర్ మణ్యం చవకరకం పుస్తకాలు చదవరండీ. చూశారా ఈ రెండు వందల పేజీలున్న ఇంగ్లీషు నవల ప్రఖ్యాత రచయిత హైలీది. ఫారిన్ పేపరు.... సాహిత్యమంటే చెవికోసుకుంటారాయన.' అందో లేదో 'మా మిస్టర్ షా కూడా అంతేనండీ. రోజుకో పుస్తకం చదివేస్తారు. ప్రతి ఆదివారం కొత్త ఇంగ్లీషు నవల కొంటారు. డిటెక్టివ్స్. పొయిట్రీ ... ఒహ్ టేమిటి. ఎలాగూ మాటొచ్చింది కాబట్టి అడుగుతున్నాను. అదివ్వండి. చదివి మళ్ళీ ఇచ్చేస్తాను. షా గారు కూడా నిముషాల్లో చదివేస్తారు" అంది మిసెస్ షా.

మర్నాడు మళ్ళీ కల్సుకున్నప్పుడు మిసెస్ మణ్యం "ఎలా వుందన్నారు మీ షా గారు!"

"మార్వలెస్. హైథాట్‌లో వుందన్నారు. నా మట్టుకు నేను బిగపట్టి చదివేశాను" నిజానికి మిస్టర్ & మిసెస్ షా ఎవరూ చదవలేదు.

"మా మిసెస్ ఎలా సంపాదించిందో నోయ్. బ్రహ్మాండమైన నవల హైలీది".

"ఓసారియ్యండి చదివి ఇచ్చేస్తాను" అని తెచ్చి రేక్‌లో పెట్టి తాళం బిగించేడు ఎల్లెస్ మణ్యం.

ఆ సంగతి మిస్టర్ మణ్యం మిసెస్‌తో చెప్పలేదు. మిసెస్ మణ్యం మిసెస్ 'షా' ని పుస్తకం గురించి అడిగితే బాగుండదని వూరుకుంది. కొంతమంది గంటలో చదివేస్తారు. కొంతమంది నెలలు చదువుతారు. అదీ ఆమె ఆలోచన!

ఇలా ఎవరూ చదవకుండానే తక్కిన నాలుగు ఫ్లాట్సూ తిరిగేసింది పుస్తకం.

* * *

ఆఫీసులో ఆఫీసర్ల టాక్ ప్రారంభమైంది




ఇలా ఎవరు ఎవర్ని పుస్తకం గురించి అడిగితే కథ ఎక్కడ అడుగుతారో అని ఎవరూ ఎవర్ని పుస్తకం అడగలేదు!

చేరాల్సిన గూట్లోకి మాత్రం పుస్తకం చేరడం అరుదైన సంఘటనగా మిగిలిపోయింది ఎల్లెస్ మణ్యానికి!